# దినగెండం

ఎం చినట్టు ఏడే ఏడడుగులు! నాలుగ్గాళ్ళమండపం కాడి కొచ్చేస్తా. ఆ మండపాన్ని దాటుకోని నాలుగంటే నాలుగే అడుగులు! వచ్చి యింట్లో పడిపోతా. ఇంట్లో పడ్తే యింకే ముండాది?

ఇల్లు గద్దు! ఇల్లాలు ముద్దు!

అంతలోనే జరిగిపాయ. జరగరాని గోరం జరిగిపాయ. గోరాతిగోరం జరిగిపాయ. పట్టపాగులే పదిమంది నడ్సే దోవలోనే జరిగిపాయ. ఆ పదిమంది చూస్తా ఉండంగానే జరిగిపాయ. తల్సుకుంటావుంటే యిప్పటిగ్గూడా వొళ్లు జిలపరిస్తా ఉండాది. కండ్లు బూసులు కమ్మతా ఉండాయి. అటుమంటి గోరం జరిగిపాయ!

ఇంతకూ ఆ పిలగాడు ఎట్టుండాడని? అటుమంటోళ్లను చూసినప్పుడు అట్టా పుటక దొరికేది గూడా నిజింగా అదుర్ష్టమేనేమో అనిపిస్తా ఉంటింది. సద్దకంకి మాదిర సన్నంగా ఉండాడు. బాగా గింజపట్నె జొన్నకంకి మాదిర పుష్టిగా ఉండాడు. నిమ్మపాండు రంగులో నిగనిగ లాడ్తా ఉండాడు. అప్పుడే యిడిగిన మల్లెపువ్వు మాదిర్తో తెల్లంగా ఉండే గుడ్డలేసుకోని ఉండాడు. వాడిమిందట్టా చూపు పడ్తే అది మల్లా అట్టా యిట్టా మల్లమన్నా మల్లదే! – అంత సుందరాంగుడు.

ఇంకవాడు ఎక్కుండే స్కూటర్ ఎట్టుండాదని? చూస్కోబో! బొమ్మ! – తీర్చిదిద్దిన బొమ్మే అనుకో. అటుమంటి స్కూటరెక్కి గాందీరోడ్లో యిడ్సిపెట్టిన బాణం మాదిర్తో దూసుకోని వస్తా ఉండాడు.

గాందీ రోడ్డంటే? అదే. ఆ నాలుగ్గాళ్ళమండపం కాడనుంచి పరంటగా కిష్ణాపురం ఠాణా దాకా ఎగబడిపొయ్యే రోడ్డు. అదే గాందీ రోడ్డు. అది ఎట్టా ఉంటిందంటే? –

చిన్న పిలకాయిలకు చక్కిలిగిల్లి పెట్టాలంటే చిన్నంగా చేరదీస్తామా? అర్సేతిని చేతిలోకి తీసుకుంటామా? ఒకొక్క ఏలే పట్టుకుంటా యిది బువ్వ... యిది పప్పు... యిది నెయ్యి... యిది మజ్జిగ అంటా అయిదేళ్లకు అయిదుపేర్లు పెట్తామా? మల్లా అన్నీ కలిపి ఆ అర్సేతిలోనే పోసినట్లు పోస్తామా? ఆ మిందట ఈణ్ణే స్నానం చేసేది. ఈణ్మే తినేది. ఈణ్ణే పొణుకుండేది. ఈణ్ణే పొల్లాడేది! అంటామా? అద్దో! ఆమాదిరిగా అన్నీ ఆ గాందీరోడ్లోనే అగ్గిబడి పొయ్యుండాయి. ఉప్పా మిరపకాయి కొనుక్కోవాలన్నా ఆడికి పోవాల్సిందే! కూరా నారా తెచ్చుకోవాలన్నా ఆడికి పోవాల్సిందే! గుడ్డాగుసురు కొనుక్కోవాలన్నా ఆడికి పోవాల్సిందే!. అందుకే ఆ రోడ్డు ఎప్పుడు చూడు గజిబిజి గందరగోళంగా ఉంటింది.

అయితే పోలీసోళ్లు ఏమయినారంటే? ఉండారు. ఒక్కొక్కడు బారడు పొడుగు లాటీకట్టె శాతబట్టుకోని ఉండారు. పాపం! అప్పుడెప్పుడో పోలీసోళ్లు గాంది జోలికి పొయ్యేదానికి బయిపణ్ణెట్టుగా యిప్పుడు ఆ రోడ్డు పేరు చెప్తేనే బయపడి చస్తావుండారు. ఆ రోడ్డుమింద దిగబడి పోవాల్సిందే గానీ ఎగబడి పోరాదు! అని వాళ్లు ఎచ్చరికలు చేస్తానే ఉంటారు. దిగబడి వొచ్చేవాళ్లు వస్తావుంటే ఎగబడి పొయ్యేవాళ్లు పోతానే ఉంటారు.

ఆ అద్దోనపు రోడ్లో సెలాక మాదిరుండే ఆ చిన్నోడు సివ్వ మాదిర్తో వస్తావుండాడు.

పొద్దు నడిమిట్టకు ఎక్కబోతా ఉండాది. ఆ యరవకాడ నడిరోడ్లో ఒక లారీని నిలబెట్టి సామాన్లు దించుకుంటా ఉండారు. లారీలో ఆ సామాన్ల కిందేసిన సన్న సన్న యినపకమ్ములు లారీకి ఎనకపక్క అయిదారడుగులు మించాగా ఉండాయి. జాగర్తగా గుష్టి పెడ్తే కానీ అవ్వి కంట పడవు. పోనీ! కనిపించే దానికేమన్నా ఎర్రగుడ్డ పేలిక యాలాడకట్నారా? అంటే అదీలేదు.

ఆ పిలగాడు దిగబడి వస్తా ఉండాడు గదా. ఆ లారీ దరిదాపుల కాడి కొచ్చేసినాడు. అంతలోనే యిటిక తోలేదో యిసిక తోలేదో ఒక లారీ. ఎగబడి ఒక్క మోపన వస్తా ఉండాది. క్షణం యామార్తే చాలు. స్కూటర్‌తో కూడా ఆ పిలగాడు .యిసిక లారీ కింద పడేది తప్పదు. అది తప్పించు కోవాలనుకుణ్ణాడు. గబక్కని పక్కకు దూర్నాడు. ఆ తొందర్లో లారీకి ఎనక పక్కన యాలాడ్తా వుండే కమ్ములు ఎట్ట కనబడ్తాయి? వాటి పైకే దూరేకుందికి ఆ కమ్ములు ఎక్కిపాయ! పొట్ట కిందా పైనా ఈ పక్కదూరి ఆ పక్క కొచ్చేసె. ఆ పిలగాడు అట్ట పడె. స్కూటర్ యిట్టపడె.

''అయ్యో! కుయ్యో!'' మంటా అందురు ఉడ్డచేరిరి. కమ్ములెన్నేమో పెరికేసిరి. కానీ రగతం? చిమ్మన గోవితో చిమ్మినట్లు చిమ్మేసెనే. పేగులు గుత్తులు గుత్తులుగా బయటికొచ్చి యాలాడ్తా ఉండాయి. రగతం మడుగుకట్టె. దాంట్లో పడి ఆ పిలగాడు యిలయిల్లాడి పోతా వుండాడు. అప్పటికీ ఆదరాబాదరా జవురుకోని ఆస్పత్రికి ఎత్తుకోని పోతావుంటే నడిదోవలోనే వాడి పాణాలు గాల్లో కల్సిపాయ.

అటుమంటప్పుడు మణిసికి యాడలేని వైరాగ్గం వచ్చేస్తింది!

''ఏం బతుకులో? పాడు బతుకులు! ఎట్ట పోతాయో ఏంపాడో? ఎవుడికీ తెల్దు.? దినగెండం నూరేండ్లాయుస్సు.'' అని ఎక్కళ్లేని యాదాంతం వొలకబోస్తాడు. అదిగూడా ఎంత సేపు? ఒక వక్క కొరికినంత సేపు. మల్లా అంతా యదా పకారమే? అది నాది. ఇదీనాది. అంటా అల్లాటం పొల్లాటమే!

అయితే మాయమ్మ మాత్రం దీన్ని ఒక పాట మాదిర్తో పాడుకుంటా ఉండేది. మాట ఎత్తితే చాలు. 'ఈ పల్లె కొంపల్లో దినగెండం నూరేండ్లాయుస్సు రా అబ్బోడా!' అంటా ఉండేది.

ఎందుకంటారేమో? – ఆ కత చెప్పేదానికే యింత కతా చెప్పింది.

పెనుమూర్లో యిస్కూలు యిడ్సిపెట్టానే వంచిన తలెత్తకుండా వొక్కమోపన నడిస్తే బారడు పొద్దుండంగానే యిల్లు చేరుకుంటాం. ఏడెనిమిది మంది పిలకాయిలు. పురెకొక బుద్ధి. దినమ్ము అట్టమాదిర్తో కుదిరితిందా? ఆటా పాటమింద పడ్తే పొద్దు పొయ్యేది గూడా తెల్సేదే లే!

ఆ పొద్దు అనంగానే మామిడి మాకల వంకలో కొంచేపు ముగ్గురాళ్లమిట్ట మింద కొంచేపు అరట్లు గొట్టుకుంటా ఆడ్తా పాడ్తా యింటి కొచ్చేకుందికి కస్జీగిటి పడ్తా పడ్తా ఉండాది.

ఆ యరవకాడ యింట్లో అడుగుపెడ్తానే కంట్లో బడింది మునెప్ప!

మునెప్ప! – అంటే ఎవురనుకుణ్ణారు? మంత్రగాడు. ఆ పాయికట్టుకంతా పేరెత్తిన మంత్రగాడు. యాపమండ శాతబట్నాడంటే అది మొండిదైనా సరే! బండదైనా సరే! దెయ్యం ఉచ్చులు తెంపుకోని ఉరకాల్సిందే! అసలు మణిసి ఎట్టుంటాడో తెల్సా? గుమ్మటంగా గుమ్మిడి పొండు. శాటంత మొకం. చెంపకు చారడేసి మీసాలు. ఏనిగి చెవులు. ఆ చెవుల్లో తళతళ మెరస్తా ఎర్రరాళ్ల అంటుజోళ్లు... నొస్టన రూపాయి బిళ్లంత కుంకం బొట్టు. ఆ బొట్టుకింద కనుబొమ్మల్ను కలపతా కాటిక. కొందురికి ఆయన్ను చూస్తే బయం. కొందురికి బలే కుశాల!

'తెల్లార్తో యిస్కూలికి ఎలబారేటప్పుడు అందురు బాగుణ్ణారే? ఇంతలేకే ఎవురికేం వచ్చిందబ్బా?' అని లోబిరికి ఎలిబిరిగ్గానే లోపలికి పొయ్‌నా. నడవలో మంచం మింద మాయమ్మను పొణుకోబెట్టి ఉండారు. కాళ్లసందన తలకాయి పెట్టుకోని మా అయ్య మంచం పక్కనే కూసోని ఉండాడు. యాపమండ తెచ్చేదానికి మా రామన్న అణ్ణుంచే గోసిపేత ఎగజెక్కుకుంటా పరిగిత్తా ఉండాడు. మా జయమ్మక్క గంగాళం తట్టలో ఎర్రనీళ్లు కలపతా ఉండాది. మంచం కాడికి పొయ్ 'యమా!' అని పిల్సినా. నేను ఎలుగిచ్చే కుందికి మొకానికి అడ్డంగా వుండే దుప్పిటి తీసిపారేసి మాయమ్మ 'ఒరే నాయినా!' అంటా బొరోమని యేడ్సేసె.

నన్ను చూసి యాడస్తా మాయమ్మ మాయమ్మను చూసి యాడస్తా నేను! ఒకర్ని చూసి వొకరు ఏడ్సుకుంటా ఉంటే మునెప్ప ముసి ముసిగా నవ్వుకుంటా ఉండాడు.

ఇంతకూ ఏమి జరిగిందబ్బా అంటే? –

ఆ పొద్దు బేస్తారం. తమలపాకులు ఎత్తుకోని మాయమ్మ పాతగుంట సంతకు పొయ్యింది. పదికట్టల తమలపాకులు. అమ్ముకునేదేమో పైటేళకే అమ్ము కునేసింది. పడ్తా లేస్తా ఎసుర్లుపెట్టే యాళకంతా యింటి కొచ్చేసింది.

ఇల్లు బిసురోమని ఉండాది. అట్టుండకుండా యింకెట్టుంటింది? మాఅయ్య మాయన్న అంగిడోళ్ల పాదుల్లో మడకలు కట్టుకున్నారా? మా జయ్యమ్మక్క వాళ్లకు సిట్టుడుకు నీళ్లు ఎత్తుకోని పొయ్యుండాదా? రొండు దినాలుగా సేద్దిగాడు మట్టంపెట్నాడా? బర్రెగొడ్లు కట్టు గూటానబడి వొగిరిస్తా ఉండాయి. అవ్వి మాయమ్మను చూస్తానే మోర్లు పైకెత్తి 'వుయ్! వుయ్!!' అని అర్సేదానికి మొదులు పెట్టె. మాయమ్మ కడుపు అట్నే రగిలిపాయ. ఆదరాబాదరా ఆ గొడ్లకు కుడితి చూపింది. వాటి మొకాన అంత ఎండు కసువు యిదిలించింది. పైరు కోతకని కొడవండ్లు కక్కేసి పెట్టుకున్నారు. వాటిల్లో మంచి కక్కుమింద ఉండే కొడవల్ని ఏరిపించి ఎత్తుకుణ్ణింది. తట్టెత్తి చంకన ఏసుకుణ్ణింది. మిట్ట బాయి కాడికి పొయ్యింది.

మిట్టబాయి కింద జొన్న యిత్తుండారు. అది ఎలిపైరు. ఎలిపైరంటే వర్షాదారంతో పండే పంట. దాంట్లో మానావరిగా కసువు పడి ఉంటింది. ఆ కసువు కోసుకోని వొచ్చి గొడ్లకు ఎయ్యాలని మునంపెట్టి కోస్తా ఉండాది.

తమలపాకులు నెత్తిబొరువుతో నాలుగు నాలుగు ఎనిమిది మైళ్లు నడ్సిన బల్లిక... మణసలకు అంత పాడి కయ్యల్లోకి అంత పేడ యిస్తావుండే గొడ్లు కట్టుగూటాన పడుండాయన్న బాద... కొంపలో కొళ్లబొయ్‌నంత మంది ఉణ్ణా తట్టడు కసువు తెచ్చే దిక్కులేక పొయ్‌నారన్న యాష్ట అన్నీ కలగల్సుకునే కుందికి మాయమ్మకు వొళ్లు పదురు పుట్టింది. 'పొద్దు గూట్లో పడ్తే ఎట్టబ్బా... సీగిటి పడిపోతే ఎట్టబ్బా?' అని గొణుక్కుంటానే ఆసోబోసోమని కసువు కోసుకుంటా ఉండాది. అట్టా కోసుకుంటా ఉంటే చేతికి రగతం తగిలింది. 'చెయ్యి తెగకుండానే చేతికి రగతం ఎట్టొచ్చిందబ్బా?' అని సందేహపడ్తా కసువు కోసేది నిలిపేసింది. ఆ సంద సీగిట్లో కండ్లు చిట్లించి చూసింది. సగానికి సగంగా తెగిన పాముతునకొగిటి కిందబడి యిలయిల్లాడ్తా ఉండాది. ఇంకొక తునక కసువులో కలగల్సి ఎడమచేతిలో ఉండాది!

కసువు కోసుకునేటప్పుడు పిడికిళ్లు పిడికిళ్లుగా ఎడమ చేత్తో పట్టుకుంటారు. కుడిచేతి కొడవలితో కోస్తారు. ఎలిపైరు గదా! కసువు గుబుర్లు గుబుర్లుగా పెరిగి ఉండాది. ఆ గుబుర్లో పాము పడిగెత్తు కోనుండాది. పొద్దుపోతా ఉండాదని తొందరగదా! ఆ తొందర్లో గెమనించకుండా పామును వొడిసిపట్టేసింది. పాము పడిగ మాయమ్మ ఎడమచేతి పిడికిట్లో సిగలక పొయ్యుండాది. ఎప్పుడైతే పాము రొండుగా తెగిపొయ్యిందని తెల్సుకుణ్ణిందో ఎడమ చేతిని యిదిలించి పారేసి మాయమ్మ పరుగో పరుగు. తిరిగీమల్లీ చూడకుండా ఒక్కలగువుమింద వచ్చింది. కొంపలో పడిపొయ్యింది.

సరే! మంత్రాలు తంత్రాలు తాయతులు అన్నీ యదాపకారంగా జరిగిపాయ. అద్దో! ఆనాటి నుంచే మాయమ్మ ''ఈ పల్లెకొంపల్లో ఏముండాదిరా అబ్బోడా. దినగెండం నూరేండ్లాయుస్సు గదరా!'' అంటా ఉండేది.

''శివుడాగ్న లేకుండా చీమగూడా కర్సదులేమ్మా!'' అంటే-

''అది గూడా నిజిమే అనుకోరా. అయినా ఈ పల్లె కొంపల్లో వొక మందా? మాకా? ఆసిపత్రా పాడా? ఇద్దో. యిట్టా పురుగో బూశో కర్సిందంటే ఆడికి నూకలు చెల్లిపోతాయి. ఇట్ట రొండుసార్లు. అట్ట రొండుసార్లు. పెరుక్కుణ్ణిందంటే అంతే కత. అది సరే గానీ అబ్బోడా! వడ్సి పట్టుకుణ్ణెప్పుడు దాని పడిగ వాటంగా చేతికి దొరకబట్టి సరిపాయ్యింది గానీ వాటం దప్పి కాటే ఏసుంటే మల్లా ఎవుర్ని 'యమా?' అని పిల్సి ఉండేవురా?''

ఆ మాట అంటా వుంటే మాయమ్మ మొకం నీళ్లలేకుండా వరటకపాయ్న వరిపైరు వాటాన అవుపించేది.

''దినగెండం నూరేండ్లాయుస్సు! దినగెండం నూరేండ్లాయుస్సు!!'' అని అంటానే మాయమ్మ నూరేండ్లకు పైబడి బతకతా ఉండాది.

అదే ఈ ఊళ్లో చూడు. వీది వీది కొక నర్సింగ్‌హోం. సందు సందుకు ఒక్క ఆస్పత్రి. ఆస్పత్రికి అయిదుమంది డాక్టర్లు. కొదవకు ట్రాఫిక్ పోలీసోళ్లు. బారడు పొడుగు కట్టెలు శాత పట్టుకోని బందోబస్తుగా తిరగతా ఉంటారు. ఏం చేసేదానికి? బంగారట్టా పిలగాడు. ఎట్టబాయనో పాయ్‌నే! -

నాలుగ్గాళ్లమండపం కాడ నిలబడుకోని అదే ఆలోచించుకుంటా ఉండా.

ఆ దోవన పోతా పోతా ఉండి ముత్తా రెడ్డన్న నన్ను చూసె. నా దగ్గిరికొచ్చె. నా వాలకాన్ని గెమనించి 'ఏమిరా అబ్బోడా!' అనె.

''ఏముండాదిలేన్నా? కడుపుచించుకుంటే కాళ్ల కాణ్ణే పడేది. ఈ ఊళ్లో బతుకు దినగెండం నూరేండ్లాయుస్సుగా ఉండాదే? - అంటే,

''ఒరే పిచ్చోడా! ఈ ఊళ్లోనే గాదురా. ఏ ఊళ్లో చూసినా ఆడికే ఉండాది. పంజాబులో చూడు. పాలస్తీనాలో చూడు. బతుకులు ఆడికే ఉండాయి. లంకలో చూడు బతుకు ఆడికే ఉండాది. లాహోర్‌లో బతుకు ఆడికే ఉండాది. అడువుల్లో తిరిగే ప్రబాకరన్ కైనా అన్ని బందోబస్తుల్లో ఉండే రాజీవ్‌గాంధీ కైనా ఈ దేశింలో బతుకు దినగెండం నూరేండ్లాయుస్సుగానే ఉండాది. అంత దూరం ఎందుకు? ఈ కాలుష్యం వాతబడి ఈ ప్రెపంచం బతుకే ఆడికాడికి ఉండాది. నువ్వు జాగర్తరా!'' అనె.

ఈ దినగెండం నూరేండ్లాయుస్సు బతుకు గతుకుల్లో ఏం జాగర్తో ఏంపాడో? ●